కథావేదిక

# ఐ లవ్ ఇండియా

సుజనాదేవి

తోటి డాక్టర్లకెవరికీ రాని సువర్ణావకాశం... అదే విదేశాలకు వెళ్ళే సువర్ణావకాశం తనకి రావడంతో కొందరు అసూయగా, కొందరు మనస్ఫూర్తిగా మరి కొందరు ఆదరంగా గ్రీటింగ్స్ చెబుతూ ఆకాశానికెత్తేశారు. అందరి శుభాకాంక్షలతో ఉకిరిబిక్కిరయ్యాను.

'ఇక వాడికేం... కో అంటే కోటిమంది క్యూలో నిలబడి కోటి వరకట్నమైనా ఇస్తారు'

'అవును... ఇవాళ రేపు... స్వదేశంలోనే ఉద్యోగస్థుడైన వరుడు గగనమవుతుంటే విదేశీ వరుడంటే మాటలా...'

'ఆ కన్న తల్లిదండ్రులెంతటి ధన్యులో...'

'అయినా విద్య ఉండగానే సరిపోదు... అదృష్టం కూడా ఇలా వుండాలి మరి' అని రకరకాల వ్యాఖ్యానాలు వినబడుతుంటే, ఇంట్లో ఈ విషయం చెప్పడానికి గబగబా బైల్దేరాను. నిజంగానే, కన్నకలలు నిజమయ్యాయి. ఇప్పటివరకు ఎవరైనా ఫారిన్ వెళ్లివచ్చారంటే వింతగా చూస్తూ కనీసం వారితో ఒక మాట మాట్లాడినా జన్మ ధన్యమైనట్లు ఫీలయ్యేవాడిని. ఇప్పుడు నాకే ఆ అదృష్టం పట్టడంతో చెలియలి కట్ట దాటిన ఆనందంతో మనస్సు పొంగింది.

ఇంటికి రాగానే వెళ్లి అమ్మ పాదాలనంటి నమస్కరిస్తున్న నన్ను ఆశ్చర్యంగా చూస్తున్న అమ్మతో విషయం చెప్పాను. అమ్మ కళ్ళవెంబడి జలజలా ఆనందభాష్పాలు రాలాయి. వెంటనే తీసుకెళ్ళిన స్వీట్స్ చెల్లికి, అమ్మకు, నాన్నకు ఇచ్చాను. ఇంతలో నాలాగే ఫారిన్ ఛాన్స్ వచ్చిన ఫ్రెండ్ ఫోన్ చేసి రమ్మంటే వెళ్ళాను. అక్కడకూడా అంతా అభినందనల వెల్లువలో ముంచెత్తారు. అక్కడికి తీసుకెళ్ళాల్సిన వస్తువులు సమకూర్చుకోవడంతో తరువాత రోజులన్నీ త్వరత్వరగా గడిచిపోతున్నాయి. తనెళ్ళగానే ఒకటి, రెండు సంవత్సరాలలో పంపించిన డబ్బుతో చెల్లెలి పెళ్లి జరిగిపోతుంది. ఒకటి రెండెకరాల పొలంపై వచ్చే ఆదాయంతో తాను పంపించే డబ్బుతో అమ్మా, నాన్న జీవితం హాయిగా నల్లేరుపై బండిలా సాగిపోతుంది. ఆస్తి కూడా తనకే ఉండనీయమని తనేం అడగను. అయినా తమది మధ్యతరగతి కుటుంబం. పెద్దగా ఆస్తిపాస్తులు కూడా లేవు, అనుకున్నాను.

ఈ పది, పదిహేను రోజుల్లో సిటీలో మిగతా అందరి డాక్టర్స్‌తో కలిసి పనిచేసే హాస్పిటల్‌కిగానీ, తమ ఊళ్ళోని స్వంత ఆస్పత్రికిగాని ఎక్కువగా వెళ్ళలేదనే చెప్పాలి. ఏదో అత్యవసరం అన్న కేసులు ఎక్కువగా చూసుకున్నాను. నాన్నతో ముందే చెప్పాను, ఎవరైనా పల్లెటూర్లో హాస్పిటల్ పెడతానంటే వారికే తన డిస్పెన్సరీని అమ్మేయమని. ఏవో కొన్ని వస్తువులు నా వెంట తీసుకెళ్ళదలచుకున్నాను.

ఆరోజు... తన రూంలో తనుండగా ఇంట్లో ముసలిదైపోయిన ఆవును 'అమ్ముతారా' అంటూ ఎవరో ఇద్దరొచ్చారు. పాలేరు... ''అమ్మా! నిజంగానే దానివల్ల మనకు లాభమేమీ లేదమ్మా... పాలు ఇవ్వడంలేదు. చావుదలకు వున్నది. మనకు కూడా పాలెక్కువ రావడం లేదని కష్టంగా ఉంది కాబట్టి దానినమ్మేసి కొత్త గేదెను కొంటే బావుంటుంది'' అన్నాడు అక్కడే వున్న అమ్మతో.

ఆ వచ్చిన కొత్తవాళ్ళు దాని తలుగు తీసి అటు ఇటు చూస్తుంటే, ఆ గోమాతకేం అర్థమయిందోగాని దాని కళ్ళ వెంబడి జలజలా నీళ్ళు కారసాగాయి. లేగ దూడ కూడా దాని దగ్గరగా వచ్చి కన్నీళ్ళు కార్చసాగింది. ఇంట్లో నుండి చెల్లి, నాన్నకూడా బయటకొచ్చారు.

''ఏమిట్రా! అది బాగున్నప్పుడు మనమేగా లాభపడ్డాం. ఇప్పుడు దాని వయసుడిగితే లాభం లేదని అమ్మేంత కర్కశహృదయులం కాదురా! చూడరా మనల్ని వీడి వెళ్ళాలంటే అది ఎంతలా బాధపడుతోందో... అది నోరులేని ప్రాణమయినా దాని కళ్ళు దాని మనోగతాన్ని చెబుతున్నాయిరా! నాకు డబ్బు రాకపోయినా ఫర్వాలేదు, కాని దానిని అమ్మేయలేనురా'' అంది అమ్మ.

నాన్న, చెల్లి కూడా వారిస్తూ దాని దగ్గరకు వెళ్ళగానే అది ఎంతో కృతజ్ఞత చూపిస్తున్నట్లు వాళ్ళ కాళ్ళ దగ్గర శిరస్సు వంచింది. అమ్మ కళ్ళనుండి దుఃఖాశ్రువులు రాలుతున్నాయి.

అమెరికా తీసుకెళ్ళే వస్తువుల లిస్టు రాస్తూ నా గది కిటికీనుండి అంతా గమనిస్తున్న నా మనస్సెందుకో ఉలిక్కిపడింది. ఏపనీ చేయలేకపోయాను. కన్నబిడ్డ కాకపోయినా కేవలం పెంచిన మమకారానికే ఆవును అమ్మ అమ్మలేకపోయింది. మరి ఒక్కగానొక్క కొడుకునంటూ అహోరాత్రులు శ్రమించి తనను చదివించడానికి అమ్మా నాన్నలిద్దరూ తమ శాయశక్తులా కృషి చేశారు. మరి నన్ను వదలి ఉండగలరా! అయినా ఇప్పటివరకు తను కూడా అమ్మానాన్నలనొదిలి వెళ్ళలేదు. వయస్సు పైబడుతున్న వారికి డాక్టర్నైవుండి కష్టకాలంలో ఆదుకోగలనా, అంతదూరం వెళితే. తనింతవరకు గమనించలేదుగాని ఇంట్లో ఇదివరకటి ఉత్సాహ వాతావరణం లేదు. రోజూ ఏదో గిల్లికజ్జాలతో ఏడిపించి అలరించే చెల్లి, పాలేరుకు పనులు పురమాయిస్తూ వారి మాటలకు నవ్వును గుంభనంగా మీసాల చాటున దాచేస్తూ అజమాయిషీ చేసే నాన్న, ఛలోక్తులు విసురుతూ అంతటా తానే అనిపించే అమ్మా అంతా స్తబ్ధుగా గోదారిలా గంభీరంగా అయిపోయారు.

ఆలోచనల్లో ఉండగానే... ''అన్నయ్యా... రమేషన్నయ్య వచాడు'' అంటూ చెప్పి వెళ్ళిన చెల్లి శృతి మాటలకు లేచి హాల్లోకి వచ్చాను.

రమేష్ ఇల్లు తమింటికి నాలుగిళ్ళవతల ఉంటుంది. తనకన్నా మూడు, నాలుగేళ్ళు చిన్నవాడు. చదువు మానిపించి పనిలో పెడతానని వాళ్ళ నాన్న అన్నప్పుడు, అమ్మా నాన్న దగ్గరకు వచ్చి వాడే డిస్తే వాళ్ళు వెళ్లి వాళ్ళ నాన్నకు నచ్చజెప్పి డిగ్రీ అయిందనిపించారు. ఈ మధ్య పట్నంలో ఏదో జాబ్ వచ్చిందని విన్నాను.

''ఆ!... ఏంట్రా రమేష్! అంతా కులాసానేనా... కంగ్రాట్స్... జాబ్ వచ్చిందటగా!'' అంటూ పలకరించాను కరచాలనం చేస్తూ.

''ఆ... ఏదో అన్న వచ్చింది కాని... చేరడం లేదు''

'ఏం... ఎందుకని? ఈ రోజుల్లో జాబ్ రావడమే కష్టంగా ఉందికదా!' అన్నాను ఒకింతగా ఆశ్చర్యపోతూ.

''నీకు తెలియందేముందన్నా... నాన్నకు పెరాలిసిస్ వచ్చింది కదా! నే లేకపోతే నడవదు. ఈ ఊరొదలి నాన్ననే రమ్మంటే పుట్టి పెరిగిన ఊరు, తన కట్టె కూడా ఇందులోనే కలవాలంటాడు. నాన్నతోటే అమ్మకూడా. ఇక్కడి పొలం వ్యవహారాలు అవీ చూసుకోడానిక్కూడా ఎవరూ లేరు. మనకి ఉన్నది ఎందుకు వదిలేసుకోవాలి? చిన్నప్పటినుంచి చూస్తూనే ఉన్నాగా. నాన్న అనుభవం నా శక్తికి తోడైతే అంతకన్నా కావాల్సిందేముంది. ఊళ్లో మంచి గౌరవంగా బ్రతుకుతున్న

వాళ్ళం. ఈ వయసులో అమ్మావాళ్ళ మనస్సెందుకు కష్టపెట్టాలి. ఆధునిక పద్ధతుల్లో ఇక్కడే ఆ సేద్యం చేసుకుంటే బావుంటుందనుకున్నాను. అమ్మా నాన్న కూడా చాలా సంతోషించారు. నాన్నకు కొంచెం దగ్గు వస్తున్నది. నాన్నసంగతి నీకు తెలుసుగా! ఎంత పెద్ద డాక్టర్ చెప్పినా మళ్లీ నీ సలహా తీసుకుని గాని ఏ మందూ తీసుకోడు. ఇంతకు ముందు నువ్వు రాసిన మందులే ఇవి అన్నా... మళ్ళీ నిన్నడిగి రమ్మన్నాడు'' అంటూ చేతిలోని టాబ్లెట్ స్ట్రిప్ చూపించాడు రమేష్.

అవే ఎలా వేసుకోవాలో చెప్పి పంపించాను. కాని ఎందుకో మనస్సు గందరగోళంగా, గజిబిజిగా అయిపోయింది. అసలు ప్రశాంతంగా అనిపించలేదు. కోవెలకు వెళితే ప్రశాంతత లభిస్తుందేమోననిపించింది. పైగా వెళ్ళేముందు తప్పక దర్శనం చేసుకోవాలనుకున్నాను కనుక బయల్దేరాను.

పశ్చిమంలోని ఎర్రటి సూర్యుడు మాతృదేశంకై రక్తతర్పణం చేస్తున్న వీరసైనికుడు రుధిరంతో భరత మాత నుదుట పెట్టిన సింధూరంలా ఎర్రగా వున్నాడు. బాటకిరువైపులా గాలికి తలలూగిస్తూ వున్న పచ్చటి చెట్లు విజయాన్ని వరించి వచ్చిన సైనికునికి స్వాగతం చెబుతున్న ఆత్మబంధువుల్లా వున్నాయి. చుట్టూ వినిపిస్తున్న పక్షుల కిలకిలరావాలు వీరజవాన్లకు జనం పడుతున్న నీరాజనాల్లా వున్నాయి.

గుళ్ళో చిన్నప్పటినుండే తెలిసిన పూజారి ఆప్యాయంగా పలకరించాడు. లోనికెళ్ళి మనస్ఫూర్తిగా నాకు సరైన గమ్యం చూపమని ప్రార్థించి, కోనేటిగట్టున మెట్లపై కూర్చున్నాను. నీరెండ గుడిగోపురంపై నుండి నీటిపై పడి వింతగా మెరుస్తోంది. అప్పుడప్పుడు వినబడుతున్న జేగంట చప్పుడు ఆ వాతావరణానికి అదొకరకమైన పవిత్రతను ఆపాదించి పెడుతుంది. అలవోకగా వినబడుతున్న వేదమంత్రాలు మనస్సునొకరకమైన ప్రశాంతతతో నింపుతోంది.

ఇంత ప్రశాంతమైన వాతావరణాన్ని, ఈ పవిత్రతను మరొక్క రోజయితే తానిక చూడలేనేమో! ఎంత అలసటగా వున్నా, ఎన్ని కష్టాలొచ్చినా ఒక్కసారి గుడికి రాగానే అన్నీ మరచి మనస్సు ప్రశాంతమవుతుంది. చిన్నప్పుడు ప్రతీరోజు చెల్లి, తను నాన్నవెంట గుడికి పోటీలుపడి పరిగెత్తి వచ్చేవాళ్ళం. రోజూ ఎంత అల్లరి... ఎంత చలాకీ తనం... ఆ రోజులు మళ్లీ రావుకదా! ఇప్పుడు అంత తీరిక లేకపోయినా నాలుగురోజుల కొకసారయినా తప్పక ఇక్కడికి వస్తాడు. మర్నాడు ఈవేళకి తను బయల్దేరుతూ ఉంటాడేమో... మళ్లీ ఎన్ని సంవత్సరాలకు ఇవన్నీ చూస్తానో... ఆలోచనల్లోనే చీకటి పడటంతో ఇంటి ముఖం పట్టాను.

మర్నాడే ప్రయాణం కావడంతో అన్ని సామాన్లు సర్దుతున్నారు ఇంట్లో. పనులన్నీ జరుగుతున్నా ఇల్లంతా స్తబ్దుగా ఉన్నట్లనిపించింది. తనకిష్టమైన కూరలు, పిండివంటలు చేసింది అమ్మ. అంతకల్సి భోజనాలకు ఎప్పట్లాగే కూర్చున్నా ఎందుకో ఎవరూ మనస్ఫూర్తిగా తింటున్నట్లనిపించలేదునాకు. ముద్ద గొంతు దిగటం లేదు. ఏమీ తినాలనిపించలేదు.

''అయ్యో! అదేమిట్రా... అవన్నీ నీకిష్టమైనవేగా. అక్కడెలా తింటావో ఏమిటో... ఇప్పుడైనా మంచిగా తినొచ్చుగా. అలా సగం కడుపుకే తింటున్నావేంట్రా'' అంటున్న అమ్మతో చేయితోనే వద్దని వారిస్తూ మౌనంగా లేచి చేయి కడుక్కుని నా రూంలోకొచ్చాను.

ఏవో ఏవేవో ఆలోచనలు వద్దంటున్నా కందిరీగల్లా ముసరడంతో తప్పించుకునే యత్నంలో




భాగంగా టేప్ నొక్కాను.

'జననీ జన్మభూమిశ్చ... స్వర్గాదపీ గరీయసీ... ఏ తల్లి నినుగన్నదో... ఆ తల్లినే కన్న భూమి గొప్పదిరా....' పాట మంద్రస్థాయిలో వస్తోంది.

తన తాత, ముత్తాతలంతా స్వాతంత్ర్య సమరయోధులవడం వల్ల తమ ఇంట్లోకూడా దేశభక్తి పాటలపై మక్కువ ఎక్కువ. అసలు తన మదిలోని ఈ గందరగోళమంతా ఈ మాతృదేశాన్ని విడిచిపోతున్నందుకేనేమో! మళ్లీ వీటన్నింటిని తను చూస్తాడో లేదో... కనీసం తల్లిదండ్రులను కూడా... ఛ... ఆ ఊహే భరించలేకుండా వుంది. మరి ఏం ఆశించి ఎందుకు విదేశాలెళ్ళాలనుకుంటున్నాడు? డబ్బు సంపాదించడానికేనా... మరి...

''తర్వాత సరిగ్గా నిద్ర వుండదుగాని త్వరగా పడు



# ఉత్తరం

ప్రఖ్యాతి చెందిన రవీంద్రభారతి విశ్వవిద్యాలయానికి ఒకరోజున బెల్జియంనుంచి మైకేల్‌గార్వెగ్ అనే ఆయన వ్రాసిన ఓ ఉత్తరం వచ్చింది. అది విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ పేరిట వచ్చింది. ఠాగూర్ స్వర్గస్థుడైన విషయం గార్వెగ్‌కు తెలియలేదు.

రవీంద్రకు నోబెల్ బహుమతి లభించినందుకు అభినందనలు తెలుపుతూ ఆయన ఆటోగ్రాఫ్‌తో కూడిన ఫొటో పంపమంటూ గార్వెగ్ తన ఉత్తరంలో వ్రాశాడు. యూనివర్శిటీవారు తమ ఆఫీసులోనూ, ఠాగూర్ గదులలో ఆయన సంతకంతో కూడిన ఫొటోకోసం వెతికారు. చివరికి ఒక ఫొటో లభించింది. వెంటనే బెల్జియం వాస్తవ్యునికి యూనివర్శిటీవారు రవీంద్రుని ఫొటో జతపరిచి ఒక లేఖ వ్రాశారు.


''ఆ మహాకవి మరణించారని తెలియజెయ్యడానికి చింతిస్తున్నాం'' అంటూ.

# వింత వీలునామాలు

లండన్‌లో నివశిస్తున్న జేమ్స్ విల్మోట్ తన వీలునామాలో భార్యకు కేవలం 50 పౌండ్లు మాత్రమే వ్రాసి, 4 వేల పౌండ్ల ధనాన్ని ఓ మహిళకు వ్రాశాడు. అందుకు కారణం, ఆమె అతనికి టేబుల్ టెన్నిస్ నేర్పింది. అందువలన తాను చాలా కాలం ఆరోగ్యంగా వున్నాననీ, ఆ కృతజ్ఞతతో ఆవిధంగా వీలునామా వ్రాశాననీ విల్మోట్ అన్నాడు.

అమెరికాలోగల న్యూహాంప్‌షైర్‌లో ఓ లైబ్రరీకి ఒక స్త్రీ రోజూ వెళ్లి పుస్తకాలు చదివేది. ఆ లైబ్రరీలో గోడగడియారం ఎప్పుడు చూసినా సరైన టైమ్ చూపేది కాదు. అందువలన ఆమె విసిగిపోయి లైబ్రరీ వారికి తన విల్లులో వెయ్యి డాలర్లు వ్రాసింది ఓ అతి మంచి గడియారాన్ని కొని గోడకు అలంకరించమని!

-కొడిమెల




కోరా!... భోజనమే సరిగ్గా చేయలేదు. ఈ పాలు తాగు మంచి నిద్రపడుతుంది'' అంటూ పాలగ్లాసిచ్చింది అమ్మ. మౌనంగా అందుకున్నాను. టేప్ ఆఫ్ చేసి, లైటార్పి ఖాళీ గ్లాస్ తీసుకుని బలవంతాన పడుకోబెట్టి వెళ్లింది అమ్మ. ఆలోచిస్తూ అలాగే పడుకున్నాను.

నిద్రనుండి హఠాత్తుగా ఎందుకో మెలకువ వచ్చింది. బాగా దాహం వేయడంతో లేచాను. టైం ఒంటిగంటవుతుంది. తలుపు నెమ్మదిగా తెరిచి వరండాలోకొచ్చాను. ఆశ్చర్యం... అమ్మవాళ్ళ రూం నుండి సన్నగా ఏడుపు వినబడుతోంది. రోదిస్తున్న ఆ కంఠం అమ్మది.

''ఊర్కో... అంటున్నానా! ఏడ్చీ ఏడ్చీ ఆ కళ్ళలా ఉబ్బాయో చూడు. తెల్లవారి వాడు చూస్తే బాధపడతాడు. వారం రోజుల్నుండీ ఇదేపనా! ఊర్కోమంటున్నాగా... సుశీ... మన కొడుకు ప్రయోజకుడయ్యాడని సంతోషించాలిగాని... మనల్ని వదిలి వెళుతున్నందుకు ఏడవకూడదు. మనదగ్గర బాగానే డబ్బులు ఉన్నాయనుకుంటున్నాడు వాడు. పిచ్చి సన్యాసి వాడికేం తెలుసు వాడి చదువుకని అన్నీ ఇప్పటికే తాకట్టుపెట్టానని. నేను రిటైరైనప్పుడు వచ్చిన డబ్బులు కూడా వాడికే ఖర్చయ్యాయి. ఉన్న పొలం, ఇల్లు అమ్మేసి దాని పెళ్లి చేద్దాం. ఇక ఆ తర్వాత నా చేతులు ఇంకా ఉడిగిపోలేదు. ఇద్దరం ఏదో చేస్తే ఆ మాత్రం కూటికెళ్ళకపోదు... ఊర్కో...'' అది నాన్న గొంతు.

''నా బాధ అదికాదండీ... మీ నాన్న ఇదే ఊర్లో వైద్యసహాయమందక చనిపోతేనేగా, ఎంత ఖర్చయినా వాడిని డాక్టర్ చదివిద్దామని చదివించింది. ఊర్లో వాళ్ళంతా వీడు మన ఊర్లోనే ఉంటాడని ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. మళ్ళీ మీ నాన్నలాంటి చరిత్ర పునరావృతం కాదని నమ్మకమేంటి? ఇప్పుడు, ఇక్కడంతా 'చదివించేప్పుడు ఇక్కడే వుండి ప్రాక్టీస్ చేస్తాడన్నారు. ఎక్కువ డబ్బులొచ్చే అవకాశమొచ్చాక ఎవరు మాత్రం ఈ పల్లెటూరును పట్టుకు వేలాడతారు?' అంటూ మొహంమీదే అంటున్నారు. స్వాతంత్ర్య సమరయోధులుగా పేరొందిన మన కుటుంబమే మాతృదేశాన్ని వదిలి ఎక్కడకో వెళితే ఎలా క్షోభిస్తుందండీ...''

ఇంతలో బయటి తలుపు చప్పుడవడంతో గబుక్కున రూంలోకొచ్చి తలుపేసుకున్నాను. నిను వీడి మేముండలేమంటూ ఆలోచనలు మళ్ళీ చుట్టుముట్టాయి.

నేను నిజంగా ఆ తల్లికి కొడుకైనందుకు గర్వం, ఇంత చదివీ విచక్షణారహిత నిర్ణయం తీసుకున్నందుకు నాపై నాకే కోపం కలిగాయి.

ఆస్తంతా నాకేపెట్టి చిల్లిగవ్వ లేకుండా, ఎదిగిన కూతురున్నా దానికొరకు బాధపడకుండా మాతృదేశం కోసం బాధపడుతున్న నా తల్లిని చూసి గర్వం కలిగింది.

నిజంగా ఎంత మూర్ఖుడిని కాకపోతే ఈ నిర్ణయం తీసుకుంటాను. మధ్యతరగతి కుటుంబమవ్వడంతో గవర్నమెంట్ సీట్‌లో స్కాలర్‌షిప్‌లతో చదివాను. అంటే ఆ డబ్బంతా ఎవరిది? ప్రజలది కాదూ! మరి భారతదేశ ప్రజల సొమ్ముతో చదివి, సేవలు మాత్రం విదేశంలో అందించడానికి వెళుతున్నాను. తన పుస్తకాలకు, పరీక్ష ఫీజులకు, బట్టలకు, డిస్పెన్సరీకి ఉన్న డబ్బంతా ఊడ్చిపెట్టిన తల్లిదండ్రులకు అప్పుల భారాన్ని వదిలి స్వార్థంగా తాను ఎగిరిపోతున్నాను.

అమ్మావాళ్ళు తలుపు తెరిచినట్లున్నారు. అయ్యో! తాతకు ఏమయ్యింది? అంటూ వచ్చి నన్ను పిలుస్తున్నారు. లేచి బయటికొచ్చాను. చిన్నప్పటినుంచి నన్ను ఆడించిన రామయ్యతాత. శ్వాస పీల్చడానికి చాలా కష్టపడుతున్నాడు. ఫస్ట్ ఎయిడ్ చేసి, పరీక్ష చేసి వేడిపాలతో టాబ్లెట్లు వేయించాను. సరైన సమయానికి రాబట్టి ప్రాణాలతో బయటపడ్డాడు. లేదంటే చాలా కష్టమయ్యేది.

''నా ప్రాణాలు నిలబెట్టావు బాబూ... నిండు నూరేళ్ళునా ఆయుష్షు కూడా పోసుకు వర్ధిల్లు. మళ్ళీ ఇలా వస్తే ఇక ఈ ప్రాణమింతేనేమో! నువ్వు వెళ్ళిపోతున్నావటగా... ఇంకెవరు మమ్మల్ని చూస్తారు.పట్నం వెళ్ళేసరికి ప్రాణమే పోతది'' అంటుంటే నాన్న అడ్డుకుని మాట మార్చాడు.

''నీకేం కాదు తాతా... నేనెక్కడకు వెళ్ళడం లేదు. ఇక్కడే ఉంటున్నాను'' అన్న నా మాటలకు అంతా ఉలిక్కిపడ్డారు.

ముందుగా తేరుకున్నది చెల్లి. ''అన్నయ్యా... నువ్వు...'' అంది కళ్ళు మిలమిలా మెరుస్తుంటే.... ఇంకా అపనమ్మకంగా.

''పిచ్చి... ఎక్కడకూ వెళ్ళట్లేదే...'' అంటూ 'జగతి జడలో జాబిలమ్మకు వందనం... ఐలవ్ ఇండియా...' అంటూ పాడాను.

నేను బాగా పాడతానని చెల్లితో, నాతో అమ్మ ఎప్పటికీ పాడించుకుంటుంది ఆపాట. అది రాత్రన్నది కూడా మరిచి 'ఐ లవ్ ఇండియా' అంటూ పెద్దగా పాడుతూ నా చేయిపట్టుకు గిరగిరా తిరిగింది చెల్లి.

అమ్మ కళ్ళలోని ఆనందబాష్పాలు, నిగ్రహించుకుంటున్న సంతోషాన్ని చెప్పకనే చెబుతున్నాయి.

వీడెవడు... నాకొడుకు అన్నట్లు నా దగ్గరగా వచ్చి నుదుటిపై ముద్దిచ్చి, జుట్టు ఆప్యాయంగా నిమురుతుంటే జగతిలోని ప్రశాంతత అంతా నాదగ్గరే ఉన్నట్లు ప్రశాంతంగా కళ్ళు మూసుకున్నాను అమ్మ ఒడిలో బుజ్జిపాపాయిలా.

★